

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంథాలయాల్లో వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ వారం రోజులు సాహిత్య కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులంతా దరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారోత్సవ కార్యక్రమాలకు జెడ్‌పి చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఇన్చార్జ కార్యదర్శి బి.లక్ష్మి, ఉప గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తూచ్

బాణసంచా వ్యాపారానికి ప్రసిద్ధి గాంచిన విజయనగరంలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగుతున్నాయి. సామాన్యులకు అందుబాటులో లేనివిధంగా వ్యాపారులు ఇష్టానుసారం మందుగుండు సామాగ్రి ధరలు పెంచేసి దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారికి ఆనుకొని, పెట్రోల్‌బంకు సమీపాన శాశ్వతంగా షాపులు నిర్మించినా, తాత్కాలికంగా షెడ్‌లు వెలిసినా అధికారులు కనీసం కూడా పట్టించుకో పోవడంపట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- ఆకాశాన్నంటిన ధరలు
- పర్యవేక్షణ లేని అధికారులు
- అందరికీ ఆమ్యామ్యాలు
- అమాంతంగా ధరలు పెంచేసిన వ్యాపారులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరంలోని ఆర్‌టిఒ కార్యాలయం చుట్టుపక్కల గత కొంతకాలంగా మందుగుండు సామాగ్రి హోల్‌సేల్, రిటైల్ అమ్మకాలు సాగుతున్నాయి. దీపావళి సందర్భంగా వేలాది మంది జిల్లా నలుమూలల నుంచే కాకుండా పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల నుంచి సైతం ఇక్కడికి వచ్చి సామగ్రి కొనుగోలు చేస్తుంటారు. అయితే వ్యాపారులు ఇదే అదునుగా బాణాసంచా ధరలను అమాంతంగా పెంచేసి కొనుగోలుదారులను దోచేస్తున్నారు. వాస్తవానికి బాణా సంచా ధరలు ఆ ప్యాకింగ్‌లపై ఉన్న ధరకు, వాస్తవ ధరకు చాలా వ్యత్యాసం ఉంటుంది. చిచ్చుబుడ్డి ప్యాకెట్ పై ఎంఆర్‌పి ధర రూ.500 ఉంటే దాని ధర వంద రూపాయలు మాత్రమే ఉంటుంది. కానీ వ్యాపారులు వాటిని రూ.400నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. ఇలా కాకరు పువ్వొత్తులు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు, భూ చక్రాలు, తాళ్లు, సిసింద్రీలు, మతాబులు, వెన్నముద్దలు, తాటాకు బాంబులు, పెన్సిళ్లు ఇలా అన్నింటి ధరలు సామాన్యులకు అందుబాటులో లేని విధంగా ఉన్నాయి. దీపావళి నేపథ్యంలో కోట్లాది రూపాయలు వ్యాపారాలు చేస్తున్నా వాటికి లెక్కా జమ ఉండడం లేదు. వాటికి పన్ను కూడా కట్టిన దాఖలాలు లేవు. వీటి ధరలపై అడిగితే తమ సిబ్బందితో బయటకు గెంటేసే దుస్థితి ఉంటోంది. మరోవైపు మందుగుండు షాపుల్లో బాల కార్మికులను నియమించుకుంటూ అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో పనివారిని ఆదుకున్న దాఖలాలు కూడా లేవు.

పట్టించుకోని అధికారులు

నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే జాతీయ రహదారికి అనుకొని భారీగా బాణాసంచా విక్రయాలు సాగిస్తున్నారు. మరోవైపు పెట్రోల్‌బంకుకు కనీసం వంద మీటర్లు దూరం కూడా లేకుండా షాపులు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే భారీ ప్రాణ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ధరలపై గాని, ప్రభుత్వ నిబంధనలపై గాని అధికారులు పట్టించుకోవడం లేదు. రెవెన్యూ అధికారులకు, పోలీసులకు, అగ్నిమాపకశాఖ అధికారులకు ఏటా వీరు లంచాలు ఇవ్వడం వల్లే వారు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శస్తున్నారు. ఎవరికి ఇవ్వాల్సిందే వారికి ఇవ్వకపోతే ఇక్కడ షాపులు నడపగలమా? అంటూ స్వయాన వ్యాపారులు చెప్పడం అధికారుల తీరుకు అద్దం పడుతోంది.

అందుబాటులో లేని ధరలు

దీపావళి అంటేనే ఆనందాల సందడి.. ఇంటిళ్ల పాదీ కలిసి జరుపుకునే పండగ.. కానీ నేడు అలాంటి పండగ సామాన్య ప్రజలకు గుదిబండగా మారుతోంది. బాణా సంచా కొనాలంటేనే గుండె గుబేలు మంటోంది. విజయనగరంలో దీపావళి సామగ్రి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. హోల్‌సేల్ అంటూ రిటైల్ ముసుగులు వ్యాపారులు దోచుకుంటున్నారు. అందరూ సిండికేట్ అయిపోయి గత నెలరోజులుగా ధరలను అమాంతంగా పెంచేశారు. బాణా సంచా ప్యాకింగ్‌లపై ఉన్న ధరకు, వాస్తవ ధరకు 200 రెట్లు వ్యతాసం ఉంటుంది. కానీ వ్యాపారులు ఎంఆర్‌పి ధరలకు లేదంటే దానికి పదిశాతం తగ్గించి విక్రయిస్తూ కోట్లు గడిస్తున్నారు. ఉదాహరణకు అయాన్ చిచ్చుబుడ్డిల ధర రూ.650ఉండగా, 500వరకు విక్రయిస్తున్నారు. వాస్తవానికి వీటి ధర రూ.200 లోపే ఉంటుంది. కానీ వ్యాపారులు ఎంఆర్‌పి ముసుగులో జనాలను దోపిడీ చేస్తున్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

- కాంగ్రెస్ ఆధ్వర్యాన రైతు గర్జన
- కలెక్టరేట్ వద్ద ధర్నా
- ఎకరాకు రూ.50వేలు పరిహారమివ్వాలి
- పిసిసి అధ్యక్షులు రుద్రరాజు, సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

తీవ్ర వర్షాభావంతో వరిపంట ఎండిపోయిన నేపథ్యంలో జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ కమిటీ సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. రైతు గర్జనపేరిట కాంగ్రెస్ ఆధ్వర్యాన గురువారం కలెక్టరేట్ వద్ద రైతులు, ఆ పార్టీ నాయకులు పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. ముందుగా ఎత్తుబ్రిడ్జి వద్దగల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎండిపోయిన వరిదుబ్బులను పట్టుకొని ధర్నా చేశారు. ఈ సందర్భంగా గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌కు రైతుల బాధలు పట్టించుకోకుండా తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 685 మండలాలు ఉంటే 103 మండలాలను మాత్రమే కరువు మండలాలు ప్రకటించడం అన్యాయమని అన్నారు. జిల్లాలో తీవ్ర స్థాయిలో కరువు తాండవిస్తోందని తెలిపారు. పంటలు పండక, పెట్టిన పెట్టుబడులు రాక రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి దారుపురించిందన్నారు. జిల్లాలో 25మండలాలుంటే ఒక్క మండలాన్ని కూడా కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడం దుర్మార్గమన్నారు. 37 వేల ఎకరాల్లో వరి ఎండిపోయిన పరిస్థితి ఉందన్నారు. పంట నష్టాల అంచనాలు వేసి, ఎకరాకు రూ.50వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పశుగ్రాసం, తాగునీరు మెరుగైన చర్యలు తీసుకోవాలన్నారు.

రాష్ట్ర మాజీ మంత్రి, సిడబ్ల్యుసి సభ్యులు డాక్టర్ రఘువీరారెడ్డి మాట్లాడుతూ అన్నం పెట్టే రైతన్న నేడు ఇబ్బందుల్లో పడ్డారన్నారు. అప్పులు చేసి పంటలు పండక తీవ్ర మానసిక ఆందోళనలో ఉన్నారని తెలిపారు. దేశంలోను, రాష్ట్రంలోను వ్యవసాయం సంక్షోభంలో ఉందన్నారు. కనీస నష్టపరిహారం గాని, ఇన్సూరెన్స్ కూడా రావడం లేదన్నారు. తాజాగా రైతుల సాగునీటి మోటర్లకు మీటర్లు పెట్టే కార్యక్రమం దేశంలోను, రాష్ట్రంలోను జోరుగా సాగుతోందన్నారు. రాష్ట్రంలో కరువు తాండవిస్తూ ఉంటే కరువు మండలాలు ప్రకటన చేయడం లేదన్నారు. తమకు రాష్ట్రంలో బలం లేకున్నా రైతులు పక్షాన పోరాడుతున్నామన్నారు. కలెక్టర్ల ద్వారా సిఎంకు, పిఎంకు వినతులు పంపుతున్నామని తెలిపారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాల గురించి కేంద్రానికి నివేదిక కూడా పంపలేదన్నారు. వెంటనే కరువు మండలాలు ప్రకటన చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కరువు నేపథ్యంలో కేంద్రం వెంటనే రాష్ట్రానికి రూ.10వేల కోట్లు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలోకి రాగానే రాష్ట్రంలో క్వింటాకు రూ.3వేలు తగ్గకుండా మద్దతు ధర ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డోల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు సుంకర సతీష్, ఎపిసిసి వైస్ చైర్మన్ షరీఫ్, జమ్ము ఆదినారాయణ, జిల్లా మైనార్టీ అధ్యక్షులు రెహమాన్, శ్రీనివాసరావు, శ్రీకాకుళం డిసిసి సభ్యులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న పిసిసి అధ్యక్షులు రుద్రరాజు, నాయకులు, శ్రేణులు

అర్ధరాత్రి ఆందోళన కొనసాగిస్తున్న విద్యార్థులు

నేడు డయల్ యువర్ ఆర్‌టిసి డిఎం

విజయనగరం కోట : విజయనగరం ఆర్‌టిసి డిపో పరిసర ప్రాంతాల ప్రయాణికుల కోసం శుక్రవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జె. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డిపో పరిధిలో గల ప్రయాణికులంతా ఎటువంటి సమస్యలున్నా ఫోన్ ద్వారా తెలిపి నివృత్తి చేసుకోవాలని కోరారు. సమస్యలపై డిపో మేనేజర్ (9959225620)కు సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థుల పోరాట విజయం

- అర్ధరాత్రి వరకూ ఇంజినీరింగ్ విద్యార్థుల ఆందోళన
- నెలరోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని విసి హామీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన బుధవారం జెఎన్‌టియు గురజాడ ఇంజినీరింగ్ విద్యార్థులు చేపట్టిన పోరాటం ఫలించింది. విద్యార్థులు గత కొన్ని రోజులుగా ఎదుర్కొంటున్న సమస్యలపై సుమారు 29 డిమాండ్లపై ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు యూనివర్సిటీ గేటు బయట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దీంతో అర్ధరాత్రి ఎస్ఎఫ్ఐ నాయకులతో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చర్చలు జరిపారు. యూనివర్సిటీలో ముఖ్యంగా హాస్టల్ లో చదువుతున్న మౌలికంగా బాత్‌రూమ్ సమస్య ఉందని, అదనపు బాత్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, టెక్నికల్ విద్యార్థులకు అవసరం అయిన వైఫే కనెక్షన్ ఏర్పాటు చేయాలని, హాస్టల్‌లో రన్నింగ్ వాటర్ సదుపాయం మెరుగుపరచాలని, వీధి లైట్లను ఏర్పాటు చేసి విద్యార్థులను పాముల బెడద నుంచి కాపాడాలని, విద్యార్థులకు ఉన్న సెంట్రల్ లైబ్రరీలో వారి చదువుకు అనుగుణంగా పుస్తకాలు ఏర్పాటు చెయ్యాలని, విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని, క్రీడలకు సంబంధించి ఇండోర్ స్టేడియంను మరమ్మతులు చేసి,విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వీటితో పాటు మరికొన్ని డిమాండ్లపై జరిగిన చర్చలు సఫలమయ్యాయి. సమస్యలను నెల రోజుల్లో పరిష్కరిస్తామని వైస్ ఛాన్సలర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.వెంకటేష్, పి.రామ్మోహన్ మాట్లాడుతూ నిర్విరామంగా బెదిరింపులకు లొంగకుండా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసిన జె ఎన్ టి యు గురజాడ యూనివర్సిటీ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం యూనివర్సిటీలకు నిధులు కేటాయించడంపై సవతితల్లి ప్రేమ చూపుతోందని,గురజాడ యూనివర్సిటీకి నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కోరారు. వైస్ ఛాన్సలర్ ఇచ్చిన హామీ ప్రకారం సమస్యలు నెలరోజుల్లో పరిష్కారం చేయాలని, లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని తెలిపారు.

ఇ-క్రాప్ నమోదైతేనే కొనుగోలు

ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం విధి విధానాలను రూపొందించింది. గత ఏడాది జారీ చేసిన నిబంధనలతో పాటు ధాన్యం రవాణాచేసే వాహనాలకు జిపిఎస్ సిస్టమ్ తప్పకుండా ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆ భారం రైతులపై పడకుండా చూడాలని రైతులు, ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల సంగతి సరే... వాటి అమలే ఆధ్వానంగా ఉంటుందని కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- షెడ్యూల్ ప్రకారమే పంటకోత
- జిపిఎస్ వాహనాలతోనే రవాణా
- ధాన్యం కొనుగోలుకు విధివిధానాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో వరి ప్రధాన పంట. ఈ ఏడాది ఖరీఫ్‌లో అత్యధికంగా 2.31,835 ఎకరాల్లో సాగైంది. ఇందులో చాలా వరకు నీటి ఎద్దడితో ఇప్పటికే ఎండిపోయింది. మరికొంత నీటి తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటోంది. ఈనేపథ్యంలో కరువు మండలాలుగా గుర్తించడం, లేదా ఆర్థికంగా భరోసా పలకడం వంటి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం కేవలం ధాన్యం కొనుగోలు విధానాలపై మాత్రమే ముందుకు సాగుతోంది. ఇటీవల జిల్లాకు వచ్చిన సివిల్ సప్లై కమిషనర్ అరుణ్‌కుమార్ ధాన్యం కొనుగోలు, ప్రభుత్వ నిబంధనలపై సమావేశం నిర్వహించిన విషయం విధితమే. ఆ రోజు జరిగిన చర్చల ప్రకారం ఇ -క్రాప్ నమోదు చేయించుకున్న పంటలకు సంబంధించిన ధాన్యం మాత్రమే కొనుగోలు చేయనున్నారు. 2.31లక్షల ఎకరాల మేర వరి పంట ఇ-క్రాప్ నమోదు చేసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇందులోనూ 1,73,613 మంది రైతులు మంది నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంబంధిత విస్తీర్ణంలో పండిన ధాన్యం ఇకెవైసి చేయించుకున్న 1,73,613మంది రైతులకు మాత్రమే విక్రయానికి వీలుంటుంది. వీరంతా స్థానిక ఆర్‌బికెల్లో షెడ్యూల్ చేయించుకోవాలి. దాని ప్రకారమే వరి కోతలు మొదలు పెట్టాల్సి ఉంటుంది. ఈ ఏడాది సుమారు 4,63,624 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రావచ్చని, ఇందులో స్థానిక అవసరాలు పోగా, 4,05,200 మెట్రిక్ టన్నుల వరకు మిగులు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో సుమారు 3,41,000 మెట్రిక్ టన్నుల మేర కొనుగోలు చేయాలని అధికారుల లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా వున్న 510 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 246 క్లస్టర్లు ఏర్పాటు చేయాలని, ఆయా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఈ ఏడాది బ్యాంకు గ్యారెంటీలను బట్టి కాకుండా, మిల్లు సామర్థ్యాన్ని బట్టి ధాన్యం కేటాయించాలని కూడా కమిషన్ సూచన చేశారు.

ఇక్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది (ఫైల్)

ధాన్యం క్రయ, విక్రయాల నిబంధనలివే..

- ఇక్రాప్‌లో నమోదైన విస్తీర్ణంలో సాగైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తారు.
- ధాన్యం విక్రయించే రైతుకు తప్పనిసరిగా ఇకెవైసి నమోదై ఉండాలి.
- పంట కోతకు ముందే ఆర్‌బికెలో షెడ్యూల్ తీసుకుని, దానిబట్టి కోతలు మొదలుపెట్టాలి.
- నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండేలా ధాన్యం సిద్ధం చేసుకోవాలి
- కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించే వాహనానికి కచ్చితంగా జిపిఎస్ అమర్చాలి.
- గోనె సంచులను, హమాలీలను రైతులు ఏర్పాటు చేస్తే అందుకు సంబంధించిన మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఇందుకనుగుణంగా వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి.
- ఎఫ్‌టిఒ చేతికందిన తర్వాత, రైతు మిల్లుకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఎవరైనా మిల్లరు అన్‌లోడ్ చేయడానికి డబ్బులడగితే ఆర్‌బికె సిబ్బంది లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1967కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.
- ధాన్యం అమ్మే సమయంలో ఇబ్బంది ఎదురైతే జిల్లా కంట్రోల్ రూమ్ నంబరు 8331056278 నెంబర్‌కు గాని రాష్ట్ర ప్రభుత్వ టోల్ ఫ్రీ నెంబర్ 1967కు ఫోన్ చేయవచ్చు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విజయనగరంకోట : విజయనగరం డిపోలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ వర్కర్స్‌కు సర్కులర్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్‌టిసి కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం డిపోమేనేజర్‌కు రాష్ట్ర కన్వీనర్ వి.తులసీరామ్ ఆధ్వర్యాన నాయకులు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కులర్ ప్రకారం ఇవ్వాల్సిన జీతాలు కన్నా తక్కువగా కాంట్రాక్టర్ చెల్లిస్తున్నారన్నారు. కార్మికులందరికీ ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.రాములు, జగదీష్, రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు వినతి అందిస్తున్న టిడిపి నాయకులు

ఓటరు జాబితాలో లోపాలు సరిదిద్దాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాలో విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో వివిధ పోలింగ్ బూత్‌లలో ఇంటి నెంబర్లు జీరో గా చూపిస్తూ సుమారు 220 ఓట్లు నమోదై ఉన్నాయని, అటువంటి లోపాలను సరిదిద్దాలని కోరుతూ ఆర్‌డిఒకు టిడిపి నాయకులు గురువారం వినతినిచ్చారు. నగర, మండల పార్టీ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్ , బొద్దల నర్సింగరావు ఆధ్వర్యాన వినతిని అందజేశారు. నియోజకవర్గంలో ఎటువంటి అక్రమాలు లేకుండా జాబితాను తయారు చేయాలని కోరారు.

దేవస్థానం భూముల వేలం ఆపాలి

భూములను పరిశీలిస్తున్న ట్రైయినీ కలెక్టర్ త్రివినాగ్

ప్రజాశక్తి- గజపతినగరం

దేవస్థానం భూములు వేలంపాట ఆపాలని సాగుదారులు ట్రైయినీ కలెక్టర్ త్రివినాగ్ వద్ద మొరపెట్టుకున్నారు. గురువారం పాత శ్రీరంగరాజపురం, కొత్త శ్రీరంగరాజపురం గ్రామాల్లో గల దేవస్థాన భూములను ఆయన పరిశీలించారు. ఆ భూములను ఎళ్ల తరబడి సాగు చేస్తున్న రైతులను కాదని, వేలం పాట ద్వారా ధనికులకు అప్పగిస్తే ఊరుకునేది లేదని కౌలురైతు సంఘంజిల్లా కార్యదర్శి రాకోటి రాములు అన్నారు. ఆ భూములకు సాగులో ఉన్న రైతులకే కేటాయించాలని కోరారు. దీంతో ట్రైనీ కలెక్టర్ సచివాలయంలో రైతుల అభిప్రాయాలను సేకరించారు. తక్షణమే బొంగులు రీ సర్వే చేసి ఎంత భూమిని గుర్తించారో తెలపాలని తహశీల్దార్ అరుణకుమారిని ఆదేశించారు. ఇరు గ్రామాల సర్పంచులు కామినాయుడు, పైడపు నాయుడు భూముల వేలం నిర్వహించాలని కోరగా ఇరువాదనలు విన్న ట్రైనీ కలెక్టర్ నిబంధన ప్రకారం సరియైన నిర్ణయాన్ని తరువాత తెలియజేస్తామని తెలిపారు.

రూ.58లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 46,48, 49 డివిజన్‌లలో రూ.58 లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. రోడ్లు, సిసి కాలువలు, కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా 49వ డివిజన్ కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణులు మాట్లాడుతూ గత పాలకులు ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే వైసిపి ప్రభుత్వం వచ్చాక ప్రజా సమస్యలను క్షేత్ర స్థాయి పర్యటనల్లో గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజల ఆలోచలనలకు తగిన విధంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిలను మరో మారు గెలిపించుకుని మరింత అభివృద్ధి, సంక్షేమాన్ని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, కార్పొరేటర్ బొద్దూరు గోవిందమ్మ, పార్టీ నాయకులు కనుగుల రాజా, బొద్దూరు లక్ష్మణరావు, తమ్ము తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

నిరసన తెలుపుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని, నాయకులు, ప్రజలు

రహదారి బాగు చేయాలని సిపిఎం నిరసన

ప్రజాశక్తి-కొత్తవలస రూరల్

కొత్తవలసలో అధ్వానంగా మారిన రహదారులను బాగు చేయాలని సిపిఎం ఆధ్వర్యాన గురువారం మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ విజయనగరం నుంచి కొత్తవలస వెళ్లే రహదారి భీమాలి వరకు అధ్వానంగా మారిందన్నారు. రోజూ బొగ్గులారీలు తిరగడం వల్ల కాలుష్యం వల్ల ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయన్నారు. మరోవైపు రహదారులు సైతం పాడైపోయాయని తెలిపారు. పారిశ్రామిక ప్రయోజనాలు తప్ప ప్రజల ఆరోగ్యాన్ని అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలను కాలుష్యం బారి నుంచి కాపాడి, 15రోజుల్లో రోడ్లు బాగు చేయకపోతే ప్రజలతో కలిసి రహదారి దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాడి అప్పారావు, బివి రమణ, గొంప రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో సత్తాచాటిన గుణశేఖర్

విజయనగరం టౌన్ : నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం బిఎస్‌సి చదువుతున్న కంది గుణశేఖర్ ఆంధ్ర యూనివర్సిటీ బాక్సింగ్ ఇంటర్ కాలేజ్ గేమ్స్‌లో బాక్సింగ్ (75 , 80 కేజిల విభాగాలు)లో కాంస్య పతకం సాధించాడు. గుణశేఖర్‌ను కళాశాల ప్రిన్సిపల్ జి. జనార్ధన్ నాయుడు, వైస్ ప్రిన్సిపల్ బి.సుభ, ఫిజికల్ డైరెక్టర్ పి.జయలక్ష్మి అభినందించారు.

13న స్పందన రద్దు

విజయనగరం : దీపావళి నేపథ్యంలో ఈనెల 13వ తేదీ సోమవారం ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో, ఆ రోజు కలెక్టరేట్‌లో జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డి అనిత తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె ఒక ప్రకటనలో కోరారు.

గుంతల్లో చిక్కుకొన్న లారీలు

కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలో ఎం.ఆర్ అగ్రహారం నుంచి ఉత్తరావల్లి జంక్షన్‌కు ఆనుకొని ఉన్న జాతీయ రహదారిపై ఉన్న గుంతల్లో గురువారం వరుసగా రెండు లారీలు చిక్కుకున్నాయి. చిలకపాలెం నుంచి రామభద్రపురం జాతీయ రహదారికి అనుసంధానమై ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొన్నేళ్లుగా రహదారి మరమ్మతులకు గురైనా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడ్డాయి. గురువారం వరుసగా రెండు లారీలు గుంతల్లో చిక్కుకుపోవడం వల్ల ఇరువైపులా రాకపోకలు స్తంభించాయి. భారీ వాహనాలు నిలిచిపోవడంతో గంటల తరబడి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తరువాత జెసిబి సహాయంతో వాహనాలను బయటకు తీశారు.



రోడ్డు గుంతల్లో దిగబడిన లారీ టైర్లు

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

భోగాపురం.. ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బడ్డుకొండ, నాయకులు

ప్రజాశకి-విజయనగరం టౌన్

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను అందిస్తూ, అవినీతి రహితంగా పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గురువారం ఎపికి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని 1వ డివిజన్లోని సచివాలయం ప్రాంతంలో ప్రారంభించారు. ముందుగా డివిజన్ పరిధిలో లబ్ధిదారులకు ఇంతవరకు అందిన ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఆ తర్వాత బుక్లెట్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాను చేపట్టిన సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని అన్నారు. ఇచ్చిన వాగ్దానాన్ని, మాటలను తప్పిన నైజం చంద్రబాబుదైతే, ఇచ్చిన మాటను నిలబెట్టడమే జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని అన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఒక రూపంలో ప్రభుత్వ పథకాలు, అవినీతి రహితంగా అందుతున్నాయని తెలిపారు. ఒకటో డివిజన్‌కు సంబంధించి ఇప్పటివరకు మొత్తం 11 కోట్ల 35 లక్షల 66 వేల 898 రూపాయలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ అయిందని అన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీ రాములునాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, డిప్యూటీ మేయర్ యాదవ్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు, జోనల్ ఇన్చార్జ్ ముచ్చు శ్రీనివాసరావు, మాజీ వైస్ చైర్ పర్సన్ లంక వరలక్ష్మి పాల్గొన్నారు.

నెల్లిమర్ల : మండలంలోని సీతారామునిపేట సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును గురువారం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములునాయుడు, ఎంపిడిఒ జి.రామారావు, ఎంపిటిసి ఎం.శాంతికుమారి, నాయకులు రాంబారికి రామారావు, నడుపూరు పరిసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఎస్.కోట -1 సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును గురువారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, ఫోక్ అండ్ కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, జెసిఎస్ ఇన్ఛార్జి వాకాడ సతీష్, పోతనపల్లి వెంకటరావు, బుగత వెంకటేశ్వరరావు, సారిపల్లి గణేష్, దారగిరి, ఎంపిటిసి కడారి అప్పయ్య, ఆవాల కృష్ణ, తలారి అనంత్ పాల్గొన్నారు.

వేపాడ : వేపాడ గ్రామ సచివాలయంలో వద్ద సర్పంచ్ ఎం.అర్జునమ్మ ఆధ్వర్యాన డిజిటల్ బోర్డును ఎంపిపి డి.సత్యవంతులు ప్రారంభించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వి.వి.చినరామునాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.కస్తూరి, కో-ఆపరేటివ్ అధ్యక్షులు రామ్మూర్తి నాయుడు, ఎంపిడిఒ పట్నాయక్, ఇఒపిఆర్‌డి ఉమ, ఎంఇఒ పి.బాలభాస్కరరావు, పిఆర్ జెఇ ఆలీ, ఎపిఒ ఆదిలక్ష్మి, ఎపిఎం శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి గౌరి, నాయకులు జగ్గుబాబు, ఎం.సత్యనారాయణ, సర్పంచులు ఎం.గంగరాజు, ఎంపిటిసిలు గంగ తల్లి. సత్యనారాయణ, బొడ్డు శ్రీను, సర్పంచ్ కోలా సతీష్ పాల్గొన్నారు.

బొండపల్లి : విభజన వల్ల నష్టపోయిన ఆంధ్ర రాష్ట్రానికి మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎంపిపి చల్ల చలంనాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు తెలిపారు. గురువారం బొండపల్లి సచివాలయం-1 ఆవరణలో సర్పంచ్ బి.ఈశ్వరరావు అధ్యక్షతన ఈ రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు, ఎంపిడిఒ వైవి.రాజేంద్ర ప్రసాద్, తహశీల్దార్ డిఎం.జి.ఎన్.ప్రసాద్ రావు, వైస్ ఎంపిపి గొండెల ఈశ్వర రావు, ఇఒపిఆర్‌డి సుగుణాకర్ రావు, పిఎసిఎస్ అధ్యక్షులు మహంతి రమణ, జెవిఎస్ మండల కన్వీనర్ పల్లి రఘు, సర్పంచులు ఈదుబిల్లి కృష్ణ, ఎస్.ఆదినారాయణ, వైస్ సర్పంచ్ కోల వెంకటరమణ, ఎంపిటిసి సభ్యులు బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భోగాపురం : జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. భోగాపురంలోని సచివాలయం-1 పరిధిలో ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సచివాలయంలో పథకాలను తెలిపే డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన గదుల్లో నిద్రకు ఉపక్రమించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ, ఎంపిడిఒ అప్పలనాయుడు, తహశీల్దార్ బంగార్రాజు, ఇఒపిఆర్‌డి సురేష్, సర్పంచ్ అప్పయ్యమ్మ, నాయకులు పడాల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కొమ్మూరి శుభోషణరావు, సుందర హరీష్ తదితరులు పాల్గొన్నారు.

జామి : వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం జామి సచివాలయం-1లో ప్రారంభమైంది. తొలుత జామి బస్టాండ్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైసిపి మండల కన్వీనర్ గొర్లి రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపిపి ఎస్.అరుణ, జెడ్‌పిటిసి సరయు, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, వైసిపి నాయకులు పి.సంజీవి, జామి సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట.. డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

వేపాడ.. డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న ఎంపిపి సత్యవంతుడు

గజపతినగరం : గజపతినగరం సచివాలయం-1లో వై నీడ్స్ ఎపి జగన్ కార్యక్రమాన్ని జెడ్‌పిటిసి గార తవుడు ప్రారంభించారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డు, జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, సర్పంచ్ కొండమ్మ, ఎంపిటిసి కర్రి కళావతి, వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు, కర్రి నానాజీ, ఎంపిడిఒ కె.కిషోర్ కుమార్, తహశీల్దార్ ఎం.అరుణకుమారి పాల్గొన్నారు.

బొబ్బిలి : మున్సిపాలిటీ పరిధిలో రెండో సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ప్రారంభించారు. ముందుగా సంక్షేమ పథకాలు లబ్ధిని వివరించే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్లు గొలగాన రమాదేవి, చెలికాని మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, కౌన్సిలర్ చోడగంజి రమేష్‌నాయుడు, పట్టణ జెసిఎస్ కన్వీనర్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

బాడంగి.. నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బాడంగి

ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంతో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. గురువారం మండలంలోని ముగడ గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ సెంటర్ భవనాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రాలకు తిరిగే పనిలేకుండా గ్రామ స్థాయిలోనే ప్రభుత్వం అందించే అనేక రకాల సేవలు వినియోగించుకునేలా సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రజల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై పెరుగుతున్న ఆదరణ చూసి ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, డిఇ అప్పారావు, వైసిపి నాయకులు తెంటు మధుసూదన్, మండల కన్వీనర్ బి.వెంకట్ నాయుడు, వై.శివప్రసాద్, జెసిఎస్ మండల కన్వీనర్ మరిపి శంకర్‌రావు నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి ఇండోర్ స్టేడియం

బొబ్బిలి : బొబ్బిలి, పరిసర ప్రాంతాల్లో క్రీడలను అభివృద్ధి చేసేందుకు ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. ఐటిఐ కాలనీ వద్ద బుడా నిధులు రూ.1.15 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొబ్బిలి ప్రాంత క్రీడాకారులు ఇండోర్ స్టేడియం నిర్మించాలని ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నారన్నారు. టిడిపి హయాంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకున్నా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయలేదన్నారు. క్రీడాకారుల కోసం ఇండోర్ స్టేడియం నిర్మాణానికి బుడా నిధులు రూ.1.15 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆరు ఎకరాల స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. మొదటి విడతగా ప్రహరీ నిర్మాణం పూర్తి చేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, వైస్ చైర్మన్లు గొలగాన రమాదేవి, చెలికాని మురళీకృష్ణ, బుడా ప్రతినిధి ఇంటి గోపాలరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు తెంటు పార్వతి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు దీక్షలు

ప్రజాశక్తి-దత్తిరాజేరు

చిన్నచామలాపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రానికి తాము వ్యతిరేకం కాదన్నారు. గొర్రెల, మేకల పెంపకం దారుల జీవనాన్ని దెబ్బతీసేలా కెవికెను ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ప్రత్యామ్నాయ భూములను ఎంపిక చేసి, కెవికెను ఏర్పాటు చేయాలని కోరారు. దీక్షల్లో జి.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

5 బోర్లు మంజూరు

ప్రజాశక్తి-వేపాడ

చామలాపల్లి పంచాయతీకి ఐదు బోర్లు మంజూరయ్యాయి. ఎంపిపి గ్రాంట్ నుంచి రూ.2 లక్షలు, గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.3 లక్షలతో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ కోలా సతీష్ తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కె.పైడిరాజు, జెఇ దేవికి కృతజ్ఞతలు తెలియజేశారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని చూసి మరో సారి వైసిపిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. గురువారం నగర పంచాయతీలోని ఒకటో సచివాలయ పరిధిలో కొండపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని విస్మరించారన్నారు. పథకాలు కావాలంటే కాళ్లరిగిపోయేలా తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలో అందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసిపి పరిశీలకులు అంధవరపు సూరిబాబు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణారావు, వైసిపి పట్టణ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, కౌన్సిలర్ల మైపాడ ప్రసాద్, మొయిద శ్రీను, పైల భారతి, నాయకులు జనాప్రసాద్, గంటా సతీష్, బంగారు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు రఘురాజు పాదయాత్ర

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పాదయాత్ర చేపడుతున్న రఘురాజు దంపతులు

జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మండలంలోని బొడ్డవరలో తన నివాసం నుంచి తిరుపతికి ప్రారంభించిన జయహో జగనన్న పాదయాత్ర గురువారం రెండో రోజు కొనసాగింది. పట్టణంలోని ఆర్‌కె ఫంక్షన్ హాల్ నుంచి రెండోరోజు ప్రారంభమైన పాదయాత్ర మండలంలోని కొత్తూరు, వెంకటరమణపేట-తిమిడి జంక్షన్, కొత్తబొద్దాం మీదుగా సాగింది. ఈ గ్రామాలకు చెందిన ప్రజలు, అభిమానులు, పాల్గొని ఎమ్మెల్సీకి సంఘీభావం తెలిపారు. పాదయాత్రలో రఘురాజు సతీమణి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎం.వెంకటలక్ష్మి, ఎస్.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సంతోషికుమారి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో

అక్రమాలకు పాల్పడితే చర్యలు

పౌర సరఫరాల డిఎం మీనాక్షి

ప్రజాశక్తి-బొబ్బిలి

ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల డిఎం మీనాక్షి అన్నారు. స్థానిక కళాభారతి ఆడిటోరియంలో గురువారం వ్యవసాయ సహాయకులతో ధాన్యం కొనుగోలుపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యాన్ని అమ్మితే, ఆ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా కొనవద్దన్నారు. వ్యాపారుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రక్ షీట్స్ సక్రమంగా ఇవ్వాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవన్నారు. ధాన్యం కొనుగోలులో లక్ష్యాలను అధిగమించాలని చెప్పారు. ధాన్యం కొనుగోలుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి మజ్జి శ్యామసుందర్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం



బొబ్బిలి.. దరఖాస్తులను స్వీకరిస్తున్న ఆర్‌డిఒ సాయిశ్రీ

ప్రజాశక్తి-బొబ్బిలి

ఓటు హక్కు వజ్రాయుధమని, 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ కోరారు. ఓటు నమోదుపై స్థానిక ఎస్‌ఎస్‌ఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుతో మంచి పాలకులను ఎన్నుకునే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన విద్యార్థులు ఓటు హక్కు కోసం దరఖాస్తులను ఆర్‌డిఒకు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ డోల రాజేశ్వరరావు, కళాశాల వ్యవస్థాపకులు రౌతు రామమూర్తి, కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు, ప్రిన్సిపల్ రెడ్డి మోహన్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : ఓటర్ల ముసాయిదా జాబితాలో సవరణలు పక్కాగా ఉండాలని ఎన్నికల ఉపతహశీల్దార్ సత్యనారాయణ సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసాయిదా జాబితాలో మృతులు, డోర్ నంబర్ లేని వారు తొలగింపులు, 18 ఏళ్లు నిండిన వారిని చేర్చాలని సూచించారు.

'అవంతి'లో అవగాహన సదస్సు

భోగాపురం : మండలంలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన సదస్సును రెవెన్యూ అధికారులు గురువారం నిర్వహించారు. తహశీల్దార్ బంగార్రాజు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తెలిపారు. మీ భాగస్వామ్యంతో ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ చంద్రశేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం అధిపతి ఎస్.షరీఫ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

హౌసింగ్ ప్రగతిపై ఇఇ ఆరా

ప్రజాశక్తి-రేగిడి

మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయాన్ని ఇఇ శ్రీనివాసరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హౌసింగ్ ప్రగతిపై 25 సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులందరికీ జియో టాగింగ్ చేసి, బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి నిర్మాణాల్లో జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాత ఇళ్లకు బిల్లులు చెల్లిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి వారానికి హౌసింగ్ ప్రగతిపై నివేదికలు అందించాలన్నారు. కార్యక్రమంలో డిఇ మురళీమోహన్, ఎఇ జగన్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

252 మందికి కంటి పరీక్షలు

రేగిడి : మండలంలోని పెద్దశిర్లాం గ్రామంలో కాండూరి జగన్నాథం మాస్టారు ప్రథమ వర్థంతి సందర్భంగా కుమారుడు వెంకటకృష్ణ, సోదరులు గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 252 మందికి ఆప్తాలమిస్టు బాలకృష్ణ తనిఖీలు నిర్వహించారు. స్థానిక వైసిపి నాయకులు, సర్పంచ్ లెంక రాంబాబు 173 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు.

విద్యార్థులకు ట్యాబులు పంపిణీ

ప్రజాశక్తి-బాడంగి

స్థానిక భవిత కేంద్రంలో పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దృష్టి, వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు ఎంఇఒ రాజేశ్వరి ట్యాబులను పంపిణీ చేశారు. ట్యాబుల ద్వారా వినికిడి లోపమున్న విద్యార్థులు సులభంగా విద్యను నేర్చుకోవచ్చని ఎంఇఒ తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు, ఐఇఆర్‌పి సత్యనారాయణ, సరిత పాల్గొన్నారు.

రామభద్రపురం : వికలాంగ విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ఎంపిడిఒ రమామణి ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్యాబులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ తిరుమల ప్రసాద్, ఐఇఆర్‌పి చింతల రాజేశ్వరి, ప్రత్యేక ఉపాధ్యాయులు కళావతి పాల్గొన్నారు.

పూసపాటిరేగ : మండలంలో పలు పాఠశాలల్లో చదువుతున్న వికలాంగ విద్యార్థులకు, ప్రత్యేక ఉపాధ్యాయులకు గురువారం ఎంఇఒ రాజ్‌కుమార్ ట్యాబులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు ఎన్.బంగారునాయుడు, ఎం.వెంకటేశ్వరరావు, పి.అర్చన పాల్గొన్నారు.

త్వరలో నేత్ర శస్త్రచికిత్సలు

డిఎంహెచ్ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-భోగాపురం

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలలో కంటి శస్త్రచికిత్సలకు రిఫరల్‌గా నమోదుచేసిన వారికి డిసెంబర్ 31లోగా చికిత్స చేస్తామని డిఎంహెచ్ఒ భాస్కరరావు అన్నారు. ఇటీవల జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కంటి వైద్య శిబిరాలలో దృష్టి లోపం ఉన్నట్లుగా గుర్తించిన వారికి పోలిపల్లి పిహెచ్‌సి ఆవరణలో గురువారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తించిన వారికి శస్త్రచికిత్సలు అయ్యే విధంగా సంబంధిత సచివాలయ ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్‌ఎంలు బాధ్యత వహించాలన్నారు. జిల్లాలో అన్ని పిహెచ్‌సిల పరిధిలో నమోదైన రిఫరల్స్‌ను ప్రభుత్వ, కార్పొరేట్ కంటి ఆసుపత్రులకు మ్యాపింగ్ చేసినట్లు తెలిపారు. శస్త్రచికిత్స శిబిరాలకు సంబంధించిన తేదీలు ఇచ్చినట్లు చెప్పారు. పిహెచ్‌సి వైద్యాధికారి టి.తిరుపతిస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిసిహెచ్‌ఎస్ గౌరీశంకర్, జిల్లా అంధత్వ నివారణ అధికారి శివప్రసాద్, ఎంటమాలజిస్ట్ వెంకటేష్, జిల్లా కంటి వెలుగు ఆప్తాల్మిక్ అధికారులు బి.తారకేశ్వరావు, మజ్జి గణపతిరావు, సిహెచ్ఒ ఎన్.పి.జయకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటోను ఢీకొన్న బొలెరో

ఆరుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పూల్‌బాగ్‌కాలనీ సమీపాన అయ్యప్ప నగర్ వద్ద గురువారం రాత్రి ఆటోను బోలోరో వాహనం ఢీకొన్న ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి తలకు తీవ్ర గాయం కావడంతో పరిస్థితి విషమంగాఉంది. విజయనగరం నుంచి చీపురుపల్లి వైపు వేగంగా వెళ్తున్న బొలేరో తొలుత బైక్ పై వెళ్తున్న చోధకుడిని ఢీకొట్టింది.అయినా ఆగకుండా వేగంగా వెళ్లే క్రమంలో దాని ముందు వెళ్తున్న కెల్ల గ్రామానికి చెందిన ఆటోను ఢీకొంది. ఇందులో ఉన్న డ్రైవర్, అయిదుగురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. తీవ్రంగా గాయపడిన బైకిస్ట్ వర్మను సర్వ జన ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై వేధింపుల కేసులో యువకుడికి జైలుశిక్ష

ప్రజాశక్తి-బొబ్బిలి

బాలికపై వేధింపుల కేసులో యువకుడికి జైలుశిక్ష పడినట్లు పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వెలమవారివీధికి చెందిన బాలికను ఓంకార్ టాకీస్ సమీపంలో నివసిస్తున్న విక్రమ్ యేసు వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో బాలిక ఫిర్యాదు మేరకు 2019 అక్టోబర్ 29న అప్పటి ఎస్ఐ కెటిఆర్ లక్ష్మి కేసు నమోదు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నాలుగేళ్లు జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా ఫోక్సో కోర్టు జడ్జి కె.నాగమణి తీర్పు చెప్పారు.

మద్యంతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని పిరిడిలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యాపారి సంజీవిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ చెప్పారు. ముందస్తు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేసి, 15 మద్యం సీసాలతో సంజీవిని అరెస్ట్ చేశామన్నారు. బెల్ట్ షాపులు, నాటుసారా, మాదకద్రవ్యాలు నివారణకు 9440902372కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బాణసంచా పట్టివేత

ప్రజాశక్తి-బాడంగి

మండలంలో అక్రమ మందుగుండు సామగ్రి పట్టుకొన్నట్లు ఇన్‌ఛార్జి ఎస్ఐ రమేష్ తెలిపారు. ముగ్గురు వ్యక్తులు బాడంగిలో అక్రమంగా బాణసంచా అమ్మినట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేసి పట్టుకున్నట్లు చెప్పారు. ఈ సామగ్రి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

అర్జున్ మృతదేహం

గుర్తుతెలియని వ్యక్తులు చేసిన దాడిలో పాంగి అర్జున్ (35) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం గుమ్మ గ్రామానికి చెందిన పాంగి అర్జున్.. మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ అడ్డతీగ వద్దనున్న పాడుబడిన అనాథాశ్రమంలో భార్య కాంతమ్మ, కుమార్తె శ్రావణితో కలిసి ఉంటున్నాడు. గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై దాడి చేశారు. తీవ్రగాయాలైన అర్జున్‌ను స్థానికులు పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, దాడికి గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.

మాతృత్వానికి దత్తత ఒక మార్గం

విజయనగరం : దత్తత కూడా మాతృత్వానికి మరో మార్గమని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. అనాధ పిల్లలను దత్తత తీసుకోవడం ద్వారా మాతృత్వపు మమకారాన్ని, ప్రేమను పొందవచ్చునని సూచించారు. నవంబర్ నెలను మాతృత్వ మాసోత్సవంగా ప్రభుత్వం ప్రకటించడంతో, దీనికి సంబంధించిన ప్రచార గోడ పత్రికలను కలెక్టర్ నాగలక్ష్మి గురువారం విడుదల చేశారు. పిల్లలను చట్టపరంగా దత్తత పొందే మార్గాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి, సిడబ్ల్యుసి ఛైర్మన్ హిమబిందు, ఇన్‌ఛార్జ్ డిసిపియు నాగరాజు, పిఒఐసి రామకోటి, డిసిపియు సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధం కాదది.. ఊచకోత

విజయనగరం టౌన్ : అమెరికా సామ్రాజ్యవాదుల అండతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ కాల్పులను విరమించాలని డిమాండ్ చేస్తూ, పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా గురువారం నవ యువ సమాఖ్య, పిడిఎస్‌యు ఆధ్వర్యాన పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎన్‌వైఎస్ నాయకులు ఎం.అప్పలరాజు, బి.గిరిప్రసాద్, పిడిఎస్‌యు నుంచి కె.గౌతమి, బి.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష పూరిత రాజకీయాలను అడ్డుకోవాలి

భోగాపురం : ప్రభుత్వ కక్ష పూరిత రాజకీయాలను అడ్డుకోవాలని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకురాలు లోకం మాధవి అన్నారు. భోగాపురం మండలం లింగాలవలస గ్రామాన్ని గురువారం ఆమె సందర్శించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం పనితీరు అసలేమీ బాగాలేదన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలు చేరడం లేదన్నారు. మెరుగైన పరిపాలన, సామాజిక న్యాయం జనసేనతోనే సాధ్యమని అన్నారు. ప్రతీ కుటుంబాన్ని తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ నిష్పక్షపాతంగా సేవ చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు పల్ల రాంబాబు, పల్లంట్ల జగదీష్, భాను, కిరణ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

విజయనగరం టౌన్ : ఈనెల 15న విజయవాడలో జరుగు ప్రజారక్షణభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ పిలుపు నిచ్చారు. బొగ్గుల దిబ్బలో మహిళలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విభజన హామీల అమలు చేయకుండా, ఎపికి రావాల్సిన నిధులు విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్న వైసిపి, టిడిపి, జనసేన బిజెపికి కొమ్ముకాస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజా ఉద్యమాలను చేపట్టిన వారిపై నిర్బంధాలకు పాల్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ప్రజారక్షణభేరి బస్సు యాత్ర కార్యక్రమాన్ని సిపిఎం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిందని, దీనికి ముగింపుగా నవంబర్ 15వ తేదీన విజయవాడలో సభ నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజలంతా హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు.

పేదలకు న్యాయ సహాయం

శృంగవరపుకోట : పేదలకు ప్రభుత్వం ఉచితంగా న్యాయ సహాయం అందిస్తోందని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని సివిల్ జడ్జి ఎస్.వాణి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ న్యాయ సేవల చట్టం గురించి వివరించారు. లింగ, వయో, వర్గ బేధం లేకుండా ఎవరైనా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది గేదెల ప్రకాశరావు, న్యాయవాదులు బొబ్బిలి రామకృష్ణ, బి.సత్యనారాయణ, బార్ అసోసియేషన్ కోశాధికారి బి.త్రిమూర్తులు, ఆర్.సత్యనారాయణ, వి.రమణ, రామ్మూర్తి, వెంకట రావు, శేఖర్ బాబు పాల్గొన్నారు.

సతివాడ పిహెచ్‌సి వైద్యాధికారికి వీడ్కోలు

నెల్లిమర్ల : ఉన్నత చదువుల నిమిత్తం వెళ్తున్న సతివాడ పిహెచ్‌సి వైద్యాధికారి బి.సాయిసందీప్‌కి గురువారం సిబ్బంది వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిరాం మాట్లాడుతూ డాక్టర్ సాయిసందీప్ అందించిన సేవలను కొనియాడారు. కోవిడ్ సమయంలో చక్కగా సేవలందించి, పిహెచ్‌సికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని, జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తమ వైద్యాధికారిగా అవార్డును తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎస్.మాధవరావు, కె.విజయలక్ష్మి, ఈశ్వరమ్మ, ఎ.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వైద్య సేవలు

బొబ్బిలి : ప్రజల వద్దకు వైద్యం అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని 25, 26 వార్డుల్లో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, కౌన్సిలర్ ఎం.తిరుపతిరావు, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, టిపిఆర్ఒ జగన్మోహన్, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులను గుర్తించండి

శృంగవరపుకోట : ఓటర్ల జాబితాలో తప్పులను గుర్తించాలని టిడిపి విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షులు రాయవరపు చంద్రశేఖర్... ఆ పార్టీ నాయకులకు సూచించారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సున్నా ఇంటి అడ్రస్‌తో అధిక సంఖ్యలో ఓటర్లు ఉండడం, ఒకే కుటుంబానికి వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు ఉండడం జాబితా పరిశీలనలో బయటపడుతున్నాయని చెప్పారు. అనంతరం ఓటర్ల జాబితాను ఆయా గ్రామాల నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మంగరాజు, ఆదారి రమేష్, ఆదారి మహేశ్వరరావు, రామసత్యం, జనాడ సన్యాసినాయుడు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాల్సిందే

బొబ్బిలిరూరల్ : దీపావళి సామగ్రి నిబంధనల ప్రకారమే విక్రయించాలని తహశీల్దార్ డి.రాజేశ్వరరావు అన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో దీపావళి మందు గుండు సామగ్రి విక్రయదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. పట్టణంలో తాత్కాలిక లైసెన్సుల ద్వారా విక్రయాలు చేపట్టాలని సూచించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌డిటి సాయికృష్ణ, ఆర్‌ఐ కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

వేపాడ : స్థానిక పిహెచ్‌సిలో గురువారం 45 మంది గర్భిణులకు డాక్టర్ ఎ.ధరణి ఆధ్వర్యాన గైనకాలజిస్టు మధుబాల వైద్య పరీక్షలు చేశారు. వారందరికీ ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా బానాది గ్రామానికి చెందిన సత్యసాయి సేవా సమితి సభ్యులు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఆంజనేయులు, 104, పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

విజయనగరం టౌన్ : భవిష్యత్తు లక్ష్యాన్ని ముందుగా నిర్దేశించుకుని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే ఆ లక్ష్యాన్ని చేరుకోగలుగుతామని సెంచూరియన్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ ఎం.మురళీ అన్నారు. స్థానిక కసపాక చైతన్య యువజన సేవా సంఘం వ్యవస్థాపకుడు మజ్జి కాంతారావు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు భవిష్యత్తు లక్ష్యసాధనపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీన్ మురళీ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించేందుకు మార్గాలు కొలమానం కావాలి, ప్రతిభ సాధించాలన్నారు. ప్రతి మనిషిలో మనసు ఒకటి చెబితే, బుద్ధి మరొకటి చెబుతుందని ఈ రెండింటిని సమన్వయం చేసుకుని ముందుకు సాగితే భవిష్యత్తు లక్ష్యాలను సాధించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో చైతన్య యువజన సేవా సంఘం కార్యదర్శి గణపతి, విద్యార్థులు పాల్గొన్నారు.